క్లుప్తంగా

దసరా ఉత్సవాలకు పందిరి రాట



వేప చెట్టు కనకదుర్గ ఆలయం వద్ద పందిరి రాట వేస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలోని వేప చెట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించే విజయ దశమి (దసరా) ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా జరిగింది. కౌన్సిలర్, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను పందిరి రాట ముహూర్తం చేసి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు బోణం శ్రీనివాస్, గోకరకొండ కుమార్, మేడిచర్ల త్రిమూర్తులు, బెజవాడ సత్తిబాబు, పిండి నానాజీ, యాళ్ల బాబి, త్సవటపల్లి రఘు తదితరులు పందిరి రాట పాతి పూజలు చేశారు.

నేడు కవిసంధ్య స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ

యానాం: యానాం నుంచి వెలువడుతున్న కవి సంధ్య సాహితీ సాంస్కృతిక సంస్థ 50వ స్వర్ణోత్సవ సంచికను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆవిష్కరించనున్నట్లు శుక్రవారం ప్రముఖ కవి శిఖామణి, ఉపాధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో వడ్డేపల్లి కృష్ణ ప్రాంగణం, కొప్పోలు మోహనరావు వేదిక వద్ద స్వర్ణోత్సవ సంచికలో నాగరాజు రామస్వామి రచన కవన కోకిలలు ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు.

జాబ్‌మేళాలో 87 మందికి ఉద్యోగాలు

ముమ్మిడివరం: స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, జిల్లా ఉపాధి కార్యాలయ సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. దీనికి సుమారు 187 మంది అభ్యర్థులు హాజరు కాగా, 87 మంది ఉద్యోగాలు సాధించారు. మరో 23 మంది రెండో రౌండ్‌కు వచ్చారు. జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.లోక్‌మాన్, కళాశాల ప్రిన్సిపాల్ ఆనందబాబు, ఓ.నాగబాబు, జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

15న రామానుజన్ టాలెంట్ టెస్ట్

యానాం: నియోజకవర్గ పరిధిలో రామానుజన్ మేథ్స్ టాలెంట్ టెస్ట్‌ను ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్, విశ్రాంత హెచ్‌ఎం ఆనాల వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. ఆరోజు యానాం పబ్లిక్ స్కూల్, ఎంజీజీ ప్రభుత్వ హైస్కూళ్లలో ఉదయం 9..30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతుందన్నారు.

తాచుపాము హల్‌చల్

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం సమీపాన గోకవరపు మణికంఠ ఇంటిలో తాచుపాము హల్‌చల్ చేసింది. వంట గదిలో తాచుపామును గమనించిన కుటుంబీకులు భయభ్రాంతులకు గురై భీమనపల్లికి చెందిన స్నేక్‌క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అందించారు. బుసలు కొడుతున్న పామును బంధించిన గణేష్ వర్మ పామును సురక్షిత ప్రాంతంలో వదలుతానని తెలిపారు.

సావిత్రినగర్‌లో లైబ్రరీ ఏర్పాటు చేయాలని వినతి

యానాం: నియోజకవర్గ పరిధిలోని శివారు తీర గ్రామమైన సావిత్రినగర్ మత్స్యకార గ్రామంలో ప్రభుత్వం లైబ్రేరీని ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్ఏఓ మునిస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యానాం పట్టణానికి తమ గ్రామం 12 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. గ్రామంలో లైబ్రేరీ లేకపోవడంతో విద్యార్థులు, నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న యువత ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై పుదుచ్చేరి పభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు సైతం వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో యువత అధ్యక్షుడు మల్లాడి రాజు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థినులతో పాఠశాల యాజమాన్యం

ముమ్మిడివరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రీడా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీల్లో ఠానేల్లంకలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ టి.గంగాభవాని శుక్రవారం విలేకరులకు తెలిపారు. రావులపాలెం మండలం ఊబలంక హైస్కూల్లో ఈ నెల 12న జరిగిన క్రీడా పోటీలలో అండర్ - 14 విభాగంలో 100 మీటర్ల పరుగులో మనోష (ప్రథమ), రమావతి (ద్వితీయ), షాట్‌పుట్‌లో విజయదుర్గ (ద్వితీయ), సుమన (తృతీయ), లాంగ్ జంప్‌లో లక్ష్మీప్రసన్న (ప్రథమ), గౌతమి (తృతీయ), 60 మీటర్ల విభాగంలో కీర్తన (ద్వితీయ) ప్రతిభ చూపినట్టు తెలిపారు. ఆ విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నల్ల వీవీ సత్యనారాయణ అభినందించారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

- గణనాథునికి ప్రత్యేక పూజలు
- సప్తనదీ జలాలతో అభిషేకాలు



స్వామివారికి గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లిలో వేంచేసి ఉన్న సిద్ధివినాయక స్వామి 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు మాగావు నాగేంద్రవరప్రసాద్ ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన, గణపతి హోమం, సప్తనదుల జలాలతో అభిషేకాలను ఘనంగా నిర్వహించారు. పెద్దిరెడ్డి రామ్మోహన్ దంపతుల సమకూర్చిన యాపిల్ పండ్లతో స్వామి వారిని ఆకర్షణీయంగా అలంకరించారు. అనంతరం గ్రామ యువత సహకారంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా గణపతి హోమం


ముమ్మిడివరం: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక సుంకర వారి వీధిలోని విజయ గణపతి స్వామివారికి ఘనంగా గణపతి హోమం నిర్వహించారు. పెద్దింటి చిరంజీవిశర్మ ఆధ్వర్యంలో పెద్దింటి పవన్‌కుమార్ ఆచార్యులు అంగర విజయకృష్ణాచార్యులు వేద మంత్రోచ్ఛరణల మధ్య అతి వైభవంగా గణపతి హోమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సురవరపు బాబూరావు, చెల్లూరు సుబ్రహ్మణ్యం, రంబాల శంకర్రావు, సుంకర సూరిబాబు, బసవ శ్రీహరి, నిమ్మకాయల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఓఎన్జీసీలో ఘనంగా గణపతి నవరాత్రులు

తాళ్లరేవు: పి.మల్లవరం శివారు గ్రాంటు గ్రామంలో ఉన్న ఓఎన్‌జీసీ చమురు సంస్థ ప్రాంగణంలో గణపతి నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. పరిశ్రమలోని ఫైర్ సేఫ్టీ కార్యాలయంలో గత పదేళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఫైర్ సర్వీస్ ఆఫీసర్ విజయ్ పి.కాలే తెలిపారు. ఉత్సవాల ఏడో రోజైన శుక్రవారం గణనాథునికి సిబ్బంది భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ అభిషే క్ చౌదరి, ఫైర్ సూపర్‌వైజర్ లక్ష్మణ్‌కుమార్, ఫైర్‌మ్యాన్ పంపన రాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.పది వేలుకి గణపతి లడ్డూ కైవసం

అల్లవరం: గణపతి ఉత్సవాలు పురస్కరించుకుని సామంతకుర్రులోని కుళాయి ట్యాంక్ వద్ద ప్రతిష్ఠించిన సాయిలక్ష్మీ గణపతి స్వామికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూని గ్రామానికి చెందిన గుంటూరి వెంకట సతీష్ రూ.10 వేలకు వేలంలో కైవసం చేసుకున్నారు. ఆలయ కమిటీ వారు సమర్పించిన పది కేజీల లడ్డూని శుక్రవారం నిర్వహించిన వేలంలో దక్కించుకుని స్వామి వారి లడ్డూని ఊరేగింపుగా ఇంటికి తీసుకెళ్లి భక్తులకు ప్రసాదాన్ని అందించారు. గణపతి ఉత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందరనీడి సాయి, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి శ్రీను, ఆలయ చైర్మన్ పరసా రాంబాబు, గుంటూరి వెంకట సత్యనారాయణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గొల్లవిల్లిలో గణపతికి యాపిల్‌పండ్లతో అలంకరణ



గణపతి లడ్డూని వేలంలో దక్కించుకుని ఊరేగింపుగా వెళ్తున్న భక్తుడు వెంకట సతీష్



పి.మల్లవరంలో గణనాథునికి పూజలు నిర్వహిస్తున్న ఓఎన్జీసీ సిబ్బంది

ఆధునిక పరిశోధన కేంద్రాలుగా పాఠశాలలు

అమలాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకే కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద సర్వ శిక్షాభియాన్ విద్యాశాఖ, స్కూల్ వెల్ఫేర్ ఇంజినీర్ విభాగం, తదితర అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించి ప్రధాన మంత్రి శ్రీ పథకం అమలు నిర్వహణ తీరు అంశాలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తిని పెంపొందింపజేసి ప్రయోగశాలలు, ఆటస్థలాల అభివృద్ధి నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు పీఎంశ్రీ ద్వారా పాఠశాలల్లో వివిధ రకాల వసతులు కల్పించనున్నారన్నారు. తొలి దశలో జిల్లాలో ఎంపిక చేసిన 21 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అవసరమైన సదుపాయాల కల్పనకై సివిల్ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో ఎం.కమల కుమారి, సర్వ శిక్షాభియాన్ ఏపీసీ మధుసూదనరావు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్వచ్ఛత కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ఈనెల 14 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవోలు, పంచాయతీ అధికారులకు పథకం అమలుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారాలు ఉన్న బ్లాక్ స్పాట్లను చెత్త తీయడానికి అనువుగా లేని ప్రాంతాలను గుర్తించి వాటిని ఆన్‌లైన్ చేస్తూ శ్రమదానంతో పరిశుభ్ర పరచాలని పరిశుభ్రం చేసిన తర్వాత తీసిన ఫొటోలను మరలా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈనెల 17 నుంచి సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమం కింద అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల పోస్టర్ ప్రారంభిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, అధికారులు

ఉత్తమ ఉపాధ్యాయులకు ఎస్టీయూ సత్కారాలు

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న ముగ్గురు ఉపాధ్యాయులకు అమలాపురం ఎస్టీయూ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక వెత్సావారి అగ్రహారం, కొంకాపల్లిలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో అభినందన సత్కారాలు జరిగాయి. కొంకాపల్లి జవహర్‌లాల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.గణ సత్యనారాయణ, అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు పీవీఎల్‌ఎస్ శ్రీరామ్, వెత్సావారి అగ్రహారంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని మోరం సీతామహాలక్ష్మిలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. అవార్డులు పొందిన ఈ ముగ్గుర్ని ఎస్టీయూ పట్టణ శాఖ అధ్యక్షుడు నక్కా బాలకృష్ణ, మహిళా అధ్యక్షురాలు ఆర్.దుర్గ, ప్రధాన కార్యదర్శి బొరుసు రమాకాంత్, ఆర్థిక కార్యదర్శి పి.రవికుమార్ తదితరులు ఘనంగా సత్కరించి అభినందించారు. పట్టణంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.కామేశ్వరావు, ఎంఎస్ఎన్ మూర్తి, కేఎస్ఎన్ మూర్తి, ఎస్‌టీ మంజూష తదితరులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సత్కరించి వారి సేవలను కొనియాడారు.



అవార్డు గ్రహీత హెచ్‌ఎం సత్యనారాయణను సత్కరిస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

వెయిట్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ

యానాం: పాండిచ్చేరి వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల పుదుచ్చేరిలో నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో యానాం నియోజకవర్గ పరిధిలోని గిరియాంపేట క్రీడాకారులు ప్రతిభ కనబర్చి పతకాలను సాధించారు. యూత్ బాలురు 30 కేజీల విభాగంలో సంగాడి దినేష్, 40 కేజీల విభాగంలో పంతాడి గంగాద్రి ద్వితీయ స్థానం, బాలికలు 40 కేజీల విభాగంలో సంగాడి లావణ్య, 35 కేజీల్లో మల్లాడి సూర్యకీర్తి ప్రథమ స్థానం, యూత్ బాలురు 49కేజీల విభాగంలో తిరుమాడి నాగూరు ప్రథమ, సంగాడి భైరవ మూర్తి ద్వితీయ స్థానం, 67 కేజీల కేటగిరిలో దండుప్రోలు మోహన్, కాసు వెంకటేష్ ద్వితీయస్థానం, 45 కేజీల బాలికల విభాగంలో కర్రి కస్తూరి, 64 కేజీల్లో వాడ్రేవు నీలిమ ద్వితీయస్థానం, సీనియర్ బాలురులో 45 కేజీల్లో కర్రి కస్తూరి, 64 కేజీల్లో వాడ్రేవు నీలిమ తృతీయ స్థానం సాధించారు. వీరిని శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ స్టేడియంలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, పీఈటీలు పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించిన మల్లాడి

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- భర్తే చంపాడంటూ బంధువులు ఆరోపణ
- హైదరాబాద్ నుంచి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చిన బంధువులు

అమలాపురం రూరల్: పెళ్లి చేసుకుని నెల రోజులు నిండక ముందే ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లో జరిగింది. బంధువులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. అయినవిల్లి మండలం తొత్తరమూడి బాలయోగి కాలనీకి చెందిన కుడిపూడి రమ్య సత్యప్రియ (20)కు అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం నామాలవారిపాలేనికి చెందిన కొప్పిశెట్టి వెంకటసాయితో గత నెల 18న వివాహమైంది. వెంకటసాయి హైదరాబాద్ పఠాన్‌చెరువులో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్‌లో సత్యప్రియ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. తన చెల్లిని వెంకటసాయి దారుణంగా చంపాడని మృతురాలి సోదరుడు కుడిపూడి రమేష్ ఆరోపిస్తున్నాడు. ఈ నెల 10న ఫోన్ చేయగా చెల్లి చనిపోయిందని చెప్పారని కన్నీటి పర్యంతమయ్యాడు. కావాలనే నా చెల్లిని భర్త వెంకట సాయి, ఆడపడుచు కలిపి చంపేశారని రమేష్ ఆరోపిస్తున్నాడు. నా చెల్లెలు మృతిపై పలు అనుమానాలున్నాయని, మాకు న్యాయం చేయాలని మృతురాలి సోదరుడు రమేష్ కోరుతున్నాడు. రమ్య సత్యప్రియ మృతదేహాన్ని శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆమె భర్త స్వగ్రామం ఎ.వేమవరం తీసుకువచ్చారు. దీంతో ఇటు మృతుని బంధువులు, అటు భర్త బంధువులు అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలు రావడంలో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. ఇరువర్గాలు పెద్దలు చర్చించుకున్నారు. దీంతో రమ్య సత్యప్రియ మృతదేహానికి భర్త స్వగ్రామం ఎ.వేమవరంలోనే అంత్యక్రియలు నిర్వహించారు.

జాతరలు ప్రశాంతంగా నిర్వహించాలి

తాళ్లరేవు: మత్స్యకార గ్రామాల్లో నిర్వహించే అమ్మవార్ల జాతరలను ప్రశాంతంగా జరిగే విధంగా చూడాలని కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్య కృష్ణ కోరారు. కాకినాడ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం కోరంగి పంచాయతీ పరిధిలోని చినబొడ్డు వెంకటాయపాలెం, పెద్దబొడ్డు వెంకటాయపాలెం గ్రామాల్లో మహాలక్ష్మి అమ్మవార్ల జాతరలు జరగనున్న నేపథ్యంలో సీఐ చైతన్యకృష్ణ పర్యటించారు. గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుడా పార్టీలకతీతంగా నాయకులు, గ్రామ పెద్దలతో కలసి శాంతి కమిటీలను ఏర్పాటు చేశారు. అమ్మవార్ల జాతర మహోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించే విధంగా ఆయా కమిటీల సభ్యులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ, నాయకులు కొపనాతి నాగరాజు, వాడ్రేవు వీరబాబు, వైదాడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



పెదబొడ్డు వెంకటాయపాలెంలో నాయకులతో సమావేశమైన సీఐ, ఎస్సైలు

సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థులు

ఉప్పలగుప్తం: మండలంలోని వాసాలతిప్ప, భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గుంటూరులో జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీడీలు కామన మధు, మల్లాడి సురేష్‌లు శుక్రవారం తెలిపారు. గురువారం ఊబలంకలో జరిగిన పోటీల్లో వాసాలతిప్ప విద్యార్థులు కొల్లు కాసుబాబు, కర్రి నరసింహ, పి.సమీర, ఎం.లావణ్య, జాన్‌మోజెస్‌లు భీమనపల్లి విద్యార్థులు బడుగు అక్షిత, జోషితావర్షిణిలు ఎంపికయ్యారు. గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పీడీలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎస్‌వీవీ సత్యనారాయణ, అరవ నాయుడు, పాఠశాల కమిటీ చైర్మన్‌లు గుర్లింక చిన్న, కొల్లు రాంబాబు, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు.



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

వరద బాధితులకు భోజన ప్యాకెట్ల పంపిణీ

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెంలో వరద ప్రభావానికి ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శుక్రవారం భోజన ప్యాకెట్లు అందజేశారు. పల్లిపాలెంలోని వరద ప్రభావిత ప్రాంతంలో శుక్రవారం పర్యటించి బాధితులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీఓ కృష్ణమోహన్, టీడీపీ నాయకులు చింతా శ్రీను, ముత్యాల బాబి, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

5కే రన్ మారథాన్ విజేతలకు అభినందనలు

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో యూత్ ఫెస్ట్ 5కే రన్ మారథాన్ దిగ్విజయంగా నిర్వహించడం జరిగిందని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ నియంత్రణ అధికారి సీహెచ్‌వీ భరతలక్ష్మి తెలిపారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో విజేతలను శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మహేష్‌కుమార్ విజేతలకు సర్టిఫికెట్స్, బహుమతులు అందించారు. యువకుల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచడానికి దేశవ్యాప్తంగా కొన్ని కార్యక్రమాలను నిర్వహించాలని జాతీయ ఎయిడ్స్ కంట్రోల్ సంస్థ కార్యాచరణ చేసిందన్నారు. వాటిలో మారథాన్ రన్ 17-25 ఏళ్ల యువత కోసం కళాశాల విద్యార్థులు, రెడ్ రిబ్బన్ క్లబ్‌లతో భాగస్వామ్యంతో ఈ ర్యాలీ జరిగింది. డీఅండ్‌ఎంహెచ్‌ఓ దుర్గారావు దొర, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రతినిధులు చంద్రశేఖర్, రామరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి విజేతలు ఈ నెల 17న ఉదయం 6 గంటలకు విజయవాడలో జరిగే యూత్ ఫెస్ట్ 5కే రన్ మారథాన్‌లో పాల్గొంటారని భరతలక్ష్మి తెలిపారు.

ఆర్‌ఆర్‌పీని ప్రజలకు ఇబ్బంది లేనిచోట పెట్టాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసే రిసోర్స్ రికవరీ పార్క్ (ఆర్‌ఆర్‌పీ) చెత్తశుద్ధి కేంద్రాన్ని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేని ప్రదేశంలో నెలకొల్పాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ స్పష్టం చేశారు. ఆర్‌ఆర్‌పీ పార్క్ పై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా శుక్రవారం ఏర్పాటు చేసిన బహిరంగ విచారణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఆర్‌పీ ప్లాంట్ గోపాల్‌నగర్ విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్దే పెట్టాలన్నది తన ఉద్దేశం కాదన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆర్‌ఆర్‌పీ ప్లాంట్ ఏర్పాటు నిర్ణయంపై ప్రభుత్వం నుంచి అప్పట్లో తనకు కనీస సమాచారం లేదన్నారు. పజాఆరోగ్యానికి ఇబ్బంది లేని చోట పెట్టాలని తానే గతం నుంచి డిమాండ్ చేస్తున్నానన్నారు. గత 25 ఏళ్లుగా కనకాలపేట, భీమ్‌నగర్, ఉదయకృష్ణకాలనీలను ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డు కారణంగా ఆ ప్రాంత ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఈ సమస్యపై సీఎం రంగసామి స్పందించి ఇతర ప్రాంతానికి దానిని తరలించాలని ఎప్పటి నుంచో అయనను కోరుతున్నానన్నారు. అవసరమైతే రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలతో పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్ఏఓ మునిస్వామి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వేస్ట్ ఫైర్ మెటీరియల్‌తో జాతీయ పతాకం

తాళ్లరేవు: ప్రముఖ చమురు సంస్థ ఓఎన్జీసీకి చెందిన అగ్నిమాపక దళ సిబ్బంది వేస్ట్ ఫైర్ మెటీరియల్‌తో జాతీయ పతాకాన్ని తయారు చేసి జాతీయ సమైక్యతను చాటారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి.మల్లవరం పరిధిలోని ఓఎన్‌జీసీ ఫైర్ సిబ్బంది ప్రమాదాలు జరిగినపుడు మంటలను ఆర్పడానికి ఉపయోగించి, వ్యర్థంగా మారిన పైపు ముక్కలతో జాతీయ పతాకాన్ని తయారు చేశారు. పతాకంపై కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు అద్దడమే కాకుండా, ఒక రబ్బర్ షీట్‌ను కట్ చేసి అశోక చక్రం తయారు చేశారు. ఎంతో ఆకర్షణీయంగా ఉన్న ఈ జాతీయ పతాకాన్ని తమ కార్యాలయం ఎంట్రన్స్‌లో అందరికీ కనబడేలా ప్రదర్శించారు. దీనికోసం 24 మంది కార్మికులు వారం రోజుల పాటు శ్రమించినటట్టు ఓఎన్‌జీసీ ఇన్‌చార్జ్ ఫైర్ సర్వీస్ విజయ్ పి.కాలే తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ అభిషేక్ చౌదరి, సూపర్‌వైజర్ లక్ష్మణ్ కుమార్, ఫైర్‌మ్యాన్ రాజు బృందం పాల్గొన్నారు.



తాము తయారీ చేసిన జాతీయ పతాకం వద్ద ఓఎన్జీసీ అగ్నిమాపక శాఖ అధికారులు, కార్మికులు

సామూహిక కుంకుమార్చన

అమలాపురం రూరల్: గణపతి నవరాత్ర మహోత్సవంలో భాగంగా ఏడో రోజు శుక్రవారం బండారులంక మట్టవారిపాలెంలో అయోధ్య గణపతిగా కొలువైన సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయ సన్నిధిలో సామూహిక కుంకుమార్చన ఘనంగా జరిగింది. పురోహితులు బ్రహ్మశ్రీ కాలెపు మోహన్ అర్చకత్వాన నిర్వహించారు. కుంకుమ పూజలు చేసిన మహిళలకు కమిటీ సభ్యులు లక్ష్మీదేవి నాణెం, కాశీ నుంచి తెచ్చిన రుద్రాక్షలు, కంకణాలు ఉచితంగా పంపిణీ చేశారు.

'పవర్ లిఫ్టింగ్' ట్రోఫీల ఆవిష్కరణ



రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీల ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న ఆ క్రీడ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీలకు సంబంధించిన చాంపియన్ ట్రోఫీలను స్థానిక హెల్త్ ఫిట్‌నెస్ జిమ్‌లో ఆ క్రీడ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణ పద్మరాజు, కార్యదర్శి వంటిద్దు వెంకన్నాయుడు, ఉపాధ్యక్షుడు గారపాటి శేఖర్, కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తదితరులు ఈ ట్రోఫీలను ఆవిష్కరించారు. హైదరాబాద్, విశాఖ మెట్రో కెం కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ సౌజన్యంతో జరగనున్న ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు కోచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ సభ్యులు ముత్తాబత్తుల వెంకటరమణ, పొనకల దుర్గాప్రసాద్, చిక్కం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎకో ఫ్రెండ్లీ గణపతి నిమజ్జనం

కాట్రేనికోన: స్థానిక మావుళ్లమ్మ ఆలయం సమీపంలో ఫ్రెండ్లీ క్లబ్ సభ్యులు ప్రతిష్ఠించిన ఎకో ఫ్రెండ్లీ మట్టి గణపతి నిమజ్జనం సంప్రదాయ పద్ధతిలో జరిగింది. ఫ్రెండ్లీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకొండి నాగ రవీంద్ర జోగయ్య శాస్త్రి ఆధ్వర్యంలో వినాయ చవితికి మట్టి గణపతులను భక్తులకు అందజేశారు. అనంతరం ఐదు రోజుల పాటు చవితి పందిరిలో కొలువు తీరిన మట్టి గణపతికి ఆకొండి శ్రీకాంత్ శర్మచే శాస్త్రయుక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనోత్సవంలో ఆకొండి మహేష్ శర్మ, సుబ్రహ్మణ్య శర్మ, ఫణి శర్మ, గ్రంధి నానాజీ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ



ఉచిత సైకిళ్లను బాలికలకు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఆర్ఏఓ

యానాం: నియోజకవర్గ పరిధిలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి వివిధ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉచిత సైకిళ్లను శుక్రవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ కరిక్యులమ్‌ను ఒకటి నుంచి 12వ తరగతి వరకు అమలు చేస్తున్నందున, విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అనంతరం 64 మందికి ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ చింతా రామజోగి పాల్గొన్నారు.

వైశ్య సంఘం అధ్యక్షుడికి సత్కారం

అమలాపురం టౌన్: ఇటీవల పట్టణ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నంబూరి సత్యనారాయణమూర్తిని పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానంలో అమ్మ వారి సన్నిధిలో దేవస్థానం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘన అభినందన సత్కారం జరిగింది. దేవస్థానం మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సత్కారంలో అభివృద్ధి కమిటీ సభ్యులు యర్రంశెట్టి మూర్తి, నిమ్మకాయల నాగేశ్వరరావు, అరిగెల బాబ్జి, చీకట్ల బాలకృష్ణ, పెదమల్లు గణపతి, అరిగెల చంద్రశేఖర్ తదితరులు నంబూరిని ఘనంగా సత్కరించి అభినందించారు.

హోంగార్డుల డ్యూటీ అలవెన్స్ పెంపు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలోని పోలీస్‌శాఖలో హోంగార్డులుగా విధులు నిర్వహిస్తున్న వారి డ్యూటీ అలవెన్స్‌ను పెంచుతూ ఎల్జీ కె.కైలాస్‌నాథన్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం హోంశాఖ అండర్ సెక్రటరీ ఎంవీ హిరాన్ సంబంధిత ఆదేశాలను జారీ చేశారు. గతంలో రూ.1,056 ఉండేదని దానిని రూ.1,085కు పెంచుతూ ఆదేశాలు జారీ చేశారని ఈ పెంపుదల ఈ ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. పోలీస్‌శాఖ బడ్జెట్‌ను బట్టి డ్యూటీ అలవెన్స్‌ను సర్దుబాటు చేయాలని సూచించారు.

వరద బాధిత కళాకారులకు సాయం

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కూచిమంచి నాగమణి, కొచ్చర్లకోట బాలామణి విజయవాడ వరదల్లో నష్టపోయిన కళాకారుల కోసం రూ.50 వేల చొప్పున రూ.లక్ష సాయాన్ని రాష్ట్ర సంస్కార భారతికి అందజేశారు. ఆ ఇద్దరి మహిళలు సమకూర్చిన సాయంతో సంస్కార భారతి రాష్ట్ర శాఖ ప్రతినిధులు విజయవాడలో నష్టపోయిన 33 మంది కళాకారులకు రూ.3 వేల నగదు చొప్పున అందించి వస్త్రదానం చేశారు.

సీతారాం మృతి తీరని లోటు

తాళ్లరేవు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పేద వర్గాలకు తీరని లోటు అని పలువురు అన్నారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో సీపీఎం మండల కార్యదర్శి టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.